జెఇఇ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - తుని

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థి దేవి డేవిడ్‌జాన్సన్ కేటగిరీ విభాగంలో ఆల్ ఇండియా 1353వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ జెఇఇ అడ్వాన్స్‌డ్ కోసం ఇస్తున్న ప్రత్యేక శిక్షణ ద్వారా తమ విద్యార్థి ఈ ర్యాంకును కైవసం చేసుకున్నాడని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి డేవిడ్ జాన్సన్‌ను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

బడ్జెట్ గుబులు

- తల్లిదండ్రులకు ఫీజుల భారం
- అన్నదాతలకు పెట్టుబడుల బాధలు
- జూన్ నెల అంటేనే బెంబేలెత్తిపోతున్న వైనం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జూన్ నెల అంటేనే ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు, అటు రైతులు భయ పడుతుంటారు. ఎందుకంటే ఈ నెలలో భారీగా ఖర్చులు ఉంటాయి. ఖరీఫ్ సాగు పనులు ఇదే మాసంలో మొదలవుతాయి. మరోవైపు పాఠశాలలు పున్ణప్రారంభమవుతాయి. దీంతో మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఫీజుల ఆందోళన

కాకినాడ జిల్లాలో సుమారు 800 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, 70 జూనియర్, 50 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 3 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటి వరకు వేసవి సెలవులను ఎంజాయ్ చేసిన చిన్నారులు ఈనెల 12 నుంచి తిరిగి పాఠశాలలకు వెళ్ళాల్సి ఉంది. ఇప్పటికే ఇంటర్ తరగతులు సోమవారం నుంచే ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ప్రయివేటు, కార్పొరేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు అడ్మిషన్ల వేటలో ఉన్నాయి. అయితే ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు జూన్ బడ్జెట్ గుబులు పట్టుకుంది. కుటుంబ నిర్వహణ ఖర్చులతో పాటు పిల్లల చదువులకు ఫీజులు, కొత్తగా విద్యాసంస్థల్లో చేర్చాలంటే డొనేషన్లు, పుస్తకాల కొనుగోళ్లు, స్కూల్ బస్సుల రవాణా ఛార్జీలు ఇలా భారీగా ఖర్చులు చేయాల్సి ఉంటుంది. ఎల్‌కెజి, యుకెజి వంటి ప్రాథమిక విద్య కోసం ఒక్కో విద్యార్థికి రూ.20 వేలు నుంచి రూ.50 వేలు వెచ్చించాల్సి ఉంటుంది. బస్సు కోసం రూ.10 వేలు నుంచి దూరాన్ని బట్టి రూ.20 వేలు కట్టాల్సి ఉంటుంది. అలాగే మిగిలిన తరగతులకు సైతం రూ.50 వేలు నుంచి రూ.80 వేలు వరకూ కేటాయించాల్సి వస్తుంది. ఇంటర్, డిగ్రీ వాళ్లకు లక్షలు చెల్లించాలి. దీంతో అప్పులు చేసి ఫీజులు, డొనేషన్లు కట్టాలని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్యతరగతి వర్గాలు జూన్ నెల వచ్చిందంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఏడాది ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు మరో 10 నుంచి 20 శాతం ఫీజులను పెంచేశాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యాశాఖ పర్యవేక్షణ పూర్తిగా కొరవడిన నేపథ్యంలో ప్రయివేట్ యాజమాన్యాలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఫీజుల భారాలను తగ్గించేందుకు విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా ప్రయివేట్ సంస్థల ఆగడాలకు అడ్డుకట్ట వేయొచ్చనే వాదనలు విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నుంచి వినిపిస్తున్నాయి.

సాగు భారం..కొరవడిన ప్రభుత్వ సాయం

రైతులకు రోజురోజుకూ వ్యవసాయం భారంగా మారుతుంది. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో సాగు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓ పక్క అప్పులు చేసి భారీగా పెట్టుబడుల భారం ఎక్కువవుతుండగా మరోవైపు ప్రభుత్వం నుంచి అంతగా సహాయ సహకారాలు అందడం లేదు. దీంతో విత్తనాలు కొనుగోలు నుంచి పంటను అమ్ముకునే వరకు అన్నదాతలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఉన్న సుమారు 2 లక్షల మంది రైతులు 3 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఒక ఎకరంలో వరి పంటను సాగు చేసేందుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. అయితే ఖర్చులకు తగినట్లుగా దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఒకవేళ వచ్చినా పంటలకు సరైన గిట్టుబాటు ధర దక్కని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఏడాది రబీలో దిగుబడులు బాగానే వచ్చినప్పటికీ పంటలకు గిట్టుబాటు ధర అందలేదు. ప్రభుత్వ నిబంధనల వలన రైతులు ధాన్యాన్ని దళారులకే అమ్ముకోవావాల్సి వచ్చింది. రూ. 200 నుంచి రూ.400 వరకు నష్టపోయారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు అనేకమంది రైతులకు అక్కరకు రాకుండా పోయాయి. ఈ నెలలో మళ్లీ ఖరీఫ్ పనులు మొదలు కానున్నాయి. ఇప్పటికే ఒకటో తేదీని నారుమడుల కోసం తూర్పు డెల్టా నుంచి అధికారులు సాగునీటిని విడుదల చేశారు. రైతులకు ఈ నెలలో పెట్టుబడులు ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. గత ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాత సుఖీభవ పేరుతో రూ:20 వేలు అందజేస్తామని చెప్పినప్పటికీ ఏడాది గడుస్తున్నా నేటికీ సాయం అందలేదు. మరోవైపు ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి సర్కారు మరిచిపోయింది. ప్రీమియం భారం రైతులపైనే పడుతోంది. దీంతో కర్షకులకు కష్టాలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పెట్టుబడుల కోసం రైతులు అప్పుల కోసం తిరుగుతున్నారు. వ్యవసాయం దండగే అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో సాగు పనులకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి సాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పెట్టుబడుల కోసం అప్పులు

రబీలో సరైన గిట్టుబాటు ధర అందలేదు. ఖరీఫ్ పనులు మొదలవుతున్నాయి. పెట్టుబడుల కోసం అప్పులు చేసేందుకు తిరుగుతున్నాను. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. పెట్టుబడులు పెట్టే జూన్ నెల అంటేనే భయమేస్తుంది. మరోవైపు పిల్లల ఫీజులు చెల్లించాల్సి ఉంది. సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు భారాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి.

చిన్నపాల మహేష్, రైతు, జగ్గమ్మ గారి పేట, సామర్లకోట

ధర్నాలో మాట్లాడుతున్న మత్స్య కార్మిక సంఘం నాయకురాలు సిహెచ్ రమణి

నష్ట పరిహారం కోరుతూ మత్స్యకారుల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ఒఎన్‌జిసి, ఇతర చమురు సంస్థలకు చెందిన కంపెనీలు నష్ట పరిహారాన్ని చెల్లించాలని కోరుతూ మత్స్యకార సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మత్స్యకారులు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద మత్స్యకారులు ధర్నా చేశారు. సోమవారం మత్స్య కారులకు నష్ట పరిమారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ఉప్పలంక నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకూ మత్స్యకార సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఒఎన్‌జిసి, ఇతర ఆయిల్ కంపెనీలు, పరిశ్రమలు వ్యర్థాలతో ఏర్పడుతున్న కాలుష్యం వల్ల మత్స్య సంపద నష్ట పోయి ఉపాధి దెబ్బతింటుందని, ముమ్మిడివరం, యానాం ప్రాంతాల్లో మత్స్యకారులకు ఇస్తున్నట్టు తమకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలకు ప్రతి కుటుంబానికి ఒఎన్‌జిసి రూ.11,500 ఇవ్వాలని, సిఎస్ఆర్ నిధులతో మత్స్యకార గ్రామాలు అభివృద్ధి చేయాలని, చదువుకున్న యువతకు స్థానిక పరిశ్రమలులో ఉపాది కల్పించాలని, ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు వర్తింపచేయాలనీ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు సంగాడి ఈశ్వరావు, గేదెల రాజు, బొడ్డునాగేశ్వరావు, చొక్కా కాశీ, యు.సత్యనారాయణ, సిహెచ్.రమణి మాట్లాడుతూ ముమ్మిడివరం, యానాం నియోజక వర్గం, కె. గంగవరం మండలాల్లో మత్స్యకారులకు నష్ట పరిహారం ఇస్తున్నట్టే కాకినాడ జిల్లాలోని 60 గ్రామాల మత్స్యకారులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 4 సంవత్సరాలు నుంచి మత్స్యకారులు ఆందోళన చేస్తున్నా వారి పట్ల చిన్న చూపు తగదని అన్నారు. ఇప్పటికే ఎంఎల్ఎలు కొండబాబు, నానాజీ, ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం ఇచ్చారని కానీ నేటికీ ఏ సమాధానం ప్రభుత్వం నుంచి రాలేదన్నారు. తెలుగు ప్రజా పార్టీ అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్ మద్దతు తెలిపి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీర ప్రాంతం, మేరేయిన్ మైనింగ్‌కి ప్రోత్సాహం తెలుపుతూ అనుమ తులు ఇస్తున్నారని, దీనివల్ల మత్స్య కారులు మరిం తగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు యు. సత్యనారాయణ, వీరబాబు, ప్రసాద్, మోషే, ఎ.దుర్గాప్రసాద్, జి. గోవరాజుల తోపాటు కాకినాడ రూరల్, కాకినాడ నగరం, పిఠాపురం, తుని నియోజకవర్గాలకు చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

సామర్లకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఒంటి కాలిపై నిలబడి సోమవారం నిరసన చేపట్టారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కొండవీటి రామరాజు, ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకులు మేడిపోయిన రమణ, రత్నరాజు, రమేష్, కురుకూరి మురళీకృష్ణ, చిక్కాల నాగార్జున, ఉండవల్లి రామరాజు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, స్వామి, చంద్రు రాజేష్, వారా సన్నీ బాబు, రమణమూర్తి పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవదిక సమ్మె సోమవారం 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ సెంటర్లోని సమ్మె శిబిరం నుంచి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాసిన భద్రరావు, ఆకుల రామకృష్ణ, సుంకర సత్తిరాజు, ఎస్‌కె.బషీర్, ఎం.భద్రరావు, పి.ప్రశాంత్, ఎన్.శివకుమార్, మహాపాతిన అరుణ్, పి. శ్రీను, డి.రాజు, ఒ.సోనియా పాల్గొన్నారు.

ఉపాధి బకాయి వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - తొండంగి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సంఘం నాయకుడు సింహాచలం

ఉపాధి హామీ చట్టంలో పని చేసిన కూలీలకు చెల్లించాల్సిన ఉపాధి బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తొండంగి, కృష్ణాపురం గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్మికులను కలుసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా కూలీల నోటితోనే ఈ చట్టం మాకు వద్దు అని చెప్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నెలల తరబడి వేతన బకాయిలు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తక్షణమే ఉపాధి బకాయిలు విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని, ఉపాధి కార్మికులకు పనిదినాలు 200 రోజులు పెంచాలని, కూలి రేట్లు రూ.600 పెంచాలని, కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఇన్సూరెన్స్ రూ.5లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికిట్లు, టెంట్లు, గునపం, పారా లాంటి పని ముట్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కామేశ్వరి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

జెఇఇ ఫలితాల్లో సహస్రకు 2వ ర్యాంకు

ప్రజాశక్తి - కాకినాడ

తన్విని అభినందిస్తున్న సంస్థ నిర్వహకులు

జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో సహస్ర జూనియర్ కాలేజ్ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థిని తన్వి ఆల్ ఇండియాలో రెండో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపల్, డైరెక్టర్ మానేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సహస్ర కాలేజ్ విద్యార్థులకు నిరంతరం ఒత్తిడి లేని విద్యా విధానంలో విద్యాబోధన అందజేయడంతోనే ఈ ర్యాంకు సాధించినట్లు తెలిపాఉరు. ఇంతటి గొప్ప విజయాన్ని సాధించిన తన్వికి, వారి తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఎన్‌టిఆర్ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటిన్‌లో పేదలకు అన్నదానం చేశారు. గ్రామ టిడిపి నాయకులు శిరసాని సింగరావు ఆర్థిక సాయంతో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, బద్ధి సురేష్ పాల్గొన్నారు.

ధూమపానంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో ధూమపానంపై అవగాహనా ర్యాలీ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సిగరెట్టు, బీడీ, గుట్కా, చుట్ట వంటివాటిని వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై రోగులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెవి.నరేష్, డాక్టర్ సురేంద్ర, జిల్లా టుబాకో కంట్రోల్ ప్రోగ్రాం సోషల్ వర్కర్ పి.రాఘవులు, వైద్య సిబంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రౌతులపూడి

స్థానిక శివాలయం సెంటర్లో సోమవారం విజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు మేఘనాథ్ పరీక్షలు జరిపి రోగులకు పలు సూచనలు చేశారు.

చిరంజీవినీకుమారికి ఐద్వా నివాళి

ప్రజాశక్తి - కాకినాడ

నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాలు రమణి

ఐడియల్ కళాశాల కరెస్పాండంట్ చిరంజీవిని కుమారికి ఐద్వా జిల్లా కమిటీ ఘనంగా నివాళులర్పించింది. సోమవారం ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం ఆమె అనేక సూచనలు, సలహాలు ఇచ్చేవారని గుర్తు చేశారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి, నాయకులు భూలక్ష్మి, భవాని, దుర్గ, ఆర్.వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

వెన్నుపోటు దినంను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో జూన్ 4న జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వంగా గీత పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సాయి కళ్యాణ మండపంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఉలవకాయల నాగలోవ రాజు, నాయకులు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, అరిగెళ్ళ రామయ్యదొర, తదితరులు పాల్గొన్నారు. **రౌతులపూడి** ఈ నెల 4న ప్రత్తిపాడులో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి మండల అధ్యక్షులు చింతకాయల వీరవెంకట సత్యనారాయణ, జడ్‌పిటిసి గోల్లు లక్ష్మణమూర్తి, వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ రామకృష్ణ, వైస్ ఎంపిపి సూర్‌రెడ్డి తిరుమల రాయులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ స్వగృహంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవ, విజ్జపు రాజశేఖర్, విడ దాసరి రాజా, త్సలికి సత్య భాస్కరరావు, పెంటకోట సత్తిబాబు, ఆకుల కృష్ణ బాపూజీ, పప్పుల దుర్గారావు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక వైసిపి కార్యాలయంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తోట నరసింహం ఆవిష్కరించారు. చంద్రబాబు పాలనా వైఫల్యాలను నిరసిస్తూ జరుగుతున్న ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామకుర్తి జగాలు, తోట రాంజీ, తోట అయ్యన్న పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - సామర్లకోట

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయిందని సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ప్రజలు అసంతృప్తి కలిగించేలా ఉందన్నారు. అనంతరం తహశీల్దార్ కె.చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకులు పెద్దిరెడ్ల సత్యనారాయణ, పెదిరెడ్ల అర్జున్‌రావు, మడగల రమణ, నమ్మి సత్యనారాయణ, బర్లంకి లక్ష్మీనారాయణ, దేవమ్మ, జ్యోతి, వెంకటలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



జెఇఇ ఫలితాల్లో 'ఆదిత్య' చారిత్రాత్మక విజయం

ప్రజాశక్తి - కాకినాడ

విజేతలతో ఆదిత్య అధ్యాపక బృందం

జెఇఇ మెయిన్ పరీక్షా ఫలితాల్లో కాకినాడ ఆదిత్య చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. జెఇఇ -2025 ఫలితాల్లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో ఎం.మీసాల జయచంద్ర 169 ర్యాంకు, పి.ఆదిత్య అభిషేక్ 257వ ర్యాంకు, జి.శ్రీరామ శశాంక్ 281వ ర్యాంకు, వై. శుభ శ్రీవల్లి ఆత్రేయి, 296వ ర్యాంకు, 300 లోపు నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. వివిధ కేటగిరీల నుంచి 16, 24, 27, 41, 65, 128, 256, 281, 296, 372, 381, 399, 406, 465, 495 వంటి జాతీయస్థాయి ర్యాంకులతో ఆదిత్య అత్యుత్తమ ఫలితాలను సాధించింది. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయిలో అకడమిక్ ప్రోగ్రామ్స్‌కి ఈ ఫలితాలు నిలువటద్దంగా నిలిచాయని అన్నారు. అత్యుత్తమ జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. సెక్రెటరీ ఎన్.కృష్ణ దీపక్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో సాధించిన ఈ ఫలితాలతో జాతీయ స్థాయిలో ఆదిత్య మరొక్కసారి విజయపతాకం ఎగురవేసిందని అన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల హాస్టల్ డైరక్టర్ ఎన్.లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు ఎన్.శృతి, ఎన్. సుగుణ, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, ఐఐటి క్యాంపస్ ప్రిన్సిపల్ జె.మొయిన, అకడమిక్ డైరక్టర్ ఎస్‌వి. రాఘవరెడ్డి, ఎస్‌పి. గంగిరెడ్డి, ప్రిన్సిపల్స్ పి.సత్యనారాయణ రెడ్డి, ఐఐటి క్యాంపస్ వైస్ ప్రిన్సిపల్ ఎం. ఫణీంద్ర ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కార్మికులకు ఐడి కార్డులు అందజేస్తున్న సంఘం నాయకులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పున్నరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో తాడిశెట్టి గంగాధర్ అధ్యక్షతన జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ మాట్లాడారు. గత అనేక సంవత్సరాలుగా పాలక పార్టీలు భవన నిర్మాణ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి నిధులు తమ ప్రభుత్వ అవసరాలకు పక్కదారి పట్టించారన్నారు. ప్రస్తుతం అత్యధిక శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న భవన నిర్మాణ రంగంలో కార్మికులు సంక్షేమ పథకాలు అమలు కాక ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లు ఇవ్వటం లేదన్నారు. కార్మికుల అవస్థలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న క్లైములు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదిరెడ్డి విష్ణు, కందిరెల్ల దుర్గాప్రసాద్, బైలపూడి రాంబాబు, షేక్ ఇబ్రహీం, చక్రవర్తుల శివ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి ఎంపిటిసి

ప్రజాశక్తి - తొండంగి

మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన వైసిపి ఎంపిటిసి గుల్లా మంగాతోపాటు, దారా చిన అప్పారావు, వారి అనుచరులు టిడిపిలో చేరారు. టిడిపి నాయకులు యనమల రాజేష్, నరహరశెట్టి సూర్యప్రకాష్, వడ్డి రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం తేటగుంట టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు టిడిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా యనమల మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేసే నాయకులకు తమ పార్టీ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని అన్నారు.

మాతృమూర్తి జ్ఞాపకార్థం రోగులకు సేవలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

వైసిపి నాయకుడు దడాల జగదీష్ తన మాతృమూర్తి దడాల వెంకయ్యమ్మ జ్ఞాపకార్థం స్థానిక పిహెచ్‌సిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కాదా గోవిందకుమార్, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, కేశవ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ కొల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోనేరులో తండ్రీ కొడుకుల మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో సోమవారం మండలంలో బొర్రంపాలెం గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు సాగి నల్లబాబు(49), కుమారుడు సాయి సంజయ్‌శ్రీరామ్ (19) స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. తొండంగి మండలం వలసపాకలుకు చెందిన బంధువు మృతి చెందడంతో పరామర్శకు తండ్రి కొడుకులు ఇద్దరు వెళ్లారు. తిరిగి వస్తూ కోనేరులో స్థానాన్ని వెళ్ళగా ప్రమాదవశాత్తు కోనేరులో గల్లంతయ్యారు. స్థానికులు రక్షించే ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోయింది. అప్పటికే తండ్రి కొడుకులు ఇద్దరూ మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ వెల్లడించారు. ఇదిలావుండగా తండ్రి కొడుకులు మృతితో బొర్రంపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన సాయి సంజయ్‌శ్రీరామ్ వైజాగ్‌లో రఘు ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్నాడు. బంధువులను పరామర్శించడానికి వచ్చిన శ్రీరామ్ ఈ విధంగా మృతి చెందడం కుటుంబీకులను కలచివేసింది.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ మొదటి సంవత్సరం చదువుతున్న పరుచూరి ప్రగతి(19) హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా నర్సాపురం మండలం గుడ్లూరుకు చెందిన ప్రగతి గైట్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం నుంచి రెండో సెమిస్టర్ తరగతులు ప్రారంభం కావడంతో ప్రగతి స్వగ్రామం నుంచి ఆదివారమే వసతిగృహానికి చేరుకుంది. అప్పటి నుంచి హాస్టల్ గదిలో ఒక్కర్తే ఉంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. మొదటి సెమిస్టర్‌లో నాలుగు పరీక్షలు ఫెయిల్ అయ్యిందని, దీంతో మానసిక ఒత్తిడికి గురై మృతి చెందినట్టు అక్కడ దొరికిన సూసైడ్ నోట్ ఆధారంగా తెలిసిందని సిఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. దుప్పటి అడ్డుగా ఏర్పాటు చేసుకుని బట్టలు ఆరేసుకునే హుక్కుకు చున్నీని బిగించుకుని ఉరివేసుకుందని పోలీసులు తెలిపారు. సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపారు.

1,880 కేజీల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - కడియం

బుర్రిలంక గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 1,880 కేజీల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలెఇపారు. వాహన యజమాని పి.దొరబాబు, డ్రైవర్ కాళీకృష్ణలపై కేసు నమోదు చేశామన్నారు. వారిరువురూ బుర్రిలంకకు చెందిన వారని ఆయన తెలిపారు. అలాగే బియ్యాన్ని ఎంఎస్ఒ ప్రభాకర్‌కు అప్పగించామన్నారు.

బండారులంకలో 40 బస్తాలు..

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

బండారులంక లో సోమవారం రేషన్ బియ్యం 40 బస్తాలుఅక్రమంగా తరలిస్తుండగా అమలాపురం రూరల్ పోలీసులకు అందింది. ఈ సమాచారం మేరకు పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని సమిశ్రగూడెం బ్రిడ్జి కూడలి వద్ద ఆదివారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ ఎల్.సుందర్‌బాలాజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక లోడుతో అతి వేగంగా వాహనాలు నడపడంతో పాటు లైసెన్సులు, హెల్మెట్లు లేకపోయినా చర్యలు తప్పవన్నారు.

రెండు డ్రెడ్జింగ్ బోట్లు సీజ్

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణ శివారులో ఉన్న దండగుండ ర్యాంపులో గోదావరి నది నుంచి అక్రమంగా డ్రెడ్జింగ్ చేస్తున్న రెండు పడవలను సీజ్ చేసినట్టు ఆర్‌డిఒ సుస్మిత రాణి తెలిపారు. నదిలో నిబంధనకు విరుద్ధంగా భారీ యంత్రాలను వినియోగించి ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడులు చేసి బోట్లను సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మనుషులతో మాత్రమే ఇసుకను తవ్వి, తరలించాలన్నారు. కాని ఇక్కడ ర్యాంపులో యంత్రాలను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు పడవలను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేయాలని ఎపిఆర్ బిఇజి.మణికంఠను ఆదేశించారు. తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఆంజనేయులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ముగ్గిన నాగేశ్వరరావు(34) ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై సోమవారం ఉదయం గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో వైద్య అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంతృప్తికరంగా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ జె.వెంకటరావు, జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్య నారాయణ, సిపిఒ పి.త్రినాథ్, బిసి కార్పొరేషన్ ఈడీ ఎశ్రీనివాసరావులతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కా రాలు అందించాలని అధికారులను ఆదేశించారు. సక్రమంగా పరిష్కరించని వాటిని రెండు స్థాయిలలో ఆడిట్ చేసి తిరిగి రీ ఓపెన్ చేస్తారని, అలా ఎక్కువ దరఖాస్తులు రీ ఓపెన్ అయ్యే వాటిపిఐ వివిధ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పిజిఆర్ఎస్‌కు హాజరు కాలేని అర్జీదారులు తమ వినతులను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని అన్నారు. పిజి ఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 408 అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - గండేపల్లి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం సూరంపాలెం శివారు రామేశ్వరంపేట సెంటర్‌లో వైస్ ఎంపిపి కుంచే రాజా రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎంఎల్ఎ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను ఎంఎల్ఎ కొనియాడారు. దేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉండే గొప్ప దార్శనికుడు జగ్జీవన్‌రామ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కుంచె రాజా, ఎంఆర్‌పిఎస్ నాయకులు కొండేపూడి ఉదయ్‌కుమార్, డాక్టర్ కొండేపూడి రాజాజీ, గండేపల్లి, జగ్గంపేట మండలాల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, పుష్కర ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ అడబాల భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు కుంచే రామకృష్ణ, బొల్లంరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

సర్వర్ల మొరాయింపు

- రేషన్ సరుకుల పంపిణీలో తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రేషన్ పంపిణీకి ఈ-పోస్ మిషన్లు మొరాయించడంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు పడుతున్నారు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీకి ఆదిలోనే కష్టాలు ప్రారంభం అయ్యాయి. ప్రారంభ రోజైన ఆదివారం కొన్ని రేషన్ దుకాణాల్లో సర్వర్లు పనిచేయక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం అదే పోస్ మిషన్లు పని చేయకపోవడంతో రోజంతా లబ్ధిదారులు దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. రోజువారి కూలీలకు వెళ్లే తాము రోజంతా రేషన్ దుకాణాలు వద్ద ఉండాల్సివస్తుందని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 47 రేషన్ దుకాణాలు ఉన్నాయి. సుమారు 26 వేల రేషన్ కార్డు హోల్డర్లు ఉన్నారు. మండలంలోని లంపకలోవ, ధర్మవరం, ప్రత్తిపాడు తదితర గ్రామాల్లో సర్వర్లు పనిచేయకపోవంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వంలో ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేవారు. అయితే ఆ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి గతంలో అమలైన రేషన్ దుకాణాల వ్యవస్థను తెరపైకి తెచ్చింది. ఎండియు వాహనాల రద్దుపై ఆపరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసి లబ్ధిదారులకు సరుకులు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాత సీసాలతో కొత్త సారా అన్నట్లుగా అప్పట్లో వినియోగించిన పోస్ మిషన్లను వినియోగించడం, ఆ మిషన్లపై డీలర్లకు సరియైన అవగాహన లేకపోవడం, మధ్య మధ్యలో సర్వర్ పని చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మెషిన్ మొరాయించడంతో పడిగాపులు పడుతున్న లబ్ధిదారులు

రోజంతా దుకాణం దగ్గరే ఉన్నా

రేషన్ దుకాణం వద్ద సర్వర్ల పని చేయకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ దుకాణం వద్దే ఉన్నా. సర్వర్ పని చేయకపోవడంతో ఇబ్బంది పడ్డాము. తక్షణమే సర్వర్లు పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

శీరంశెట్టి పద్మ, లంపకలోవ

ఎండియు వాహనాలను కొనసాగించాలి

గత ప్రభుత్వంలో ఉన్న ఎండియు వ్యవస్థనే కొనసాగించాలి. రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండియు వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు ప్రతి ఇంటి వద్ద రేషన్ సరుకులు అందించేవారు. ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేయాలి.

రామిశెట్టి నాని, వైసిపి మండల కన్వీనర్, ప్రత్తిపాడు

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

గత ప్రభుత్వం సేకరించిన భూముల్లో తక్షణమే అర్హులకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని నర్సింగపురం గ్రామంలో సేకరించిన 62 ఎకరాల వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు సాక రామకృష్ణ మాట్లాడుతూ ఇళ్ళు లేని పేదల కోసం సరిపడినంత భూమిని సేకరించి వాటిని మంజూచేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ప్రజాధనంతో కొనుగోలు చేసిన భూములపై దృష్టి సారించకపోవడం సరికాదన్నారు. రెండు నెలలో పేదలకి స్థలాలు అప్పగించకపోతే బాధితులతో కలిసి గుడెసెలు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంగారు కళ్యాణ్, ధనాల సతీష్, పొట్లూరి సత్యవతి, శీలం వరలక్ష్మి, గూడుపు సత్యవతి పాల్గొన్నారు.

చిరంజీవినీకుమారి మృతికి ఐవి సంతాపం

ప్రజాశక్తి - కాకినాడ

ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్ డాక్టర్ చిరంజీవిని కుమారి మృతికి మాజీ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1990 దశకం నుంచి ఆమెతో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేశారు. వేల మంది విద్యార్థులకు ఆశ్రయమిచ్చిన ఘనత చిరంజీవినీ కుమారికి దక్కుతుందన్నారు. వామపక్ష, అభ్యుదయ ఉద్యమాల శ్రేయోభిలాషి అని కొనియాడారు. వందేళ్లకు చేరువలో ఉన్న మనిషి ఇంకా సమాజానికి ఏదో చేయాలనే తపనతోనే బ్రతికారని అన్నారు. విద్యా, సాహిత్య సైన్స్ రంగం, వామపక్ష ఉద్యమం తదితర రంగాలలో జీవిత కాలం ఆమె చేసిన కృషికి డాక్టర్ చిరంజీవిని కుమారిని 'చిరంజీవి'గానే సమాజం గుర్తు పెట్టు కుంటుందన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - శంఖవరం

ప్రమాదాల నివారణపై వాహనదారులకు పోలీసులు అవగాహనా సదస్సును నిర్వహించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు పాల్గొని మాట్లాడారు. అతివేగం, హెల్మెట్ వాడకం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. సోషల్ మీడియా లింకులు ప్రెస్ చేయొద్దని, ఆన్‌లైన్ బెట్టింగుల్లో పాల్గొనవద్దన్నారు. రహదారుల్లో ముఖ్యమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను కోరారు.

నేడు మంచి నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

యానాం రక్షిత మంచినీటి సరఫరా విభాగంలో నిర్వహణ పనులు జరుగుతున్నందున సోమవారం సాయంత్రం పలు ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని ప్రజాపనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు కాళ్ళ నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా మెట్టకూరు, గోపాల్ నగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాలవారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల జడ్‌పి ఉన్నత పాఠశాల 1991-92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. 32 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులు డికె.రామానుజాచార్యులు, మందాల వీరభద్రరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ఎస్ఎంసి ఛైర్మన్ మేడిశెట్టి శివ, స్కూల్ హెచ్ఎం సలాది వెంకటనారాయణ, పూర్వ విద్యార్థుల కమిటీ నాయకులు రాయుడు గంగాధర్, యాళ్ల సూర్యభాస్కరరావు, పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5న జిల్లాలో 2.33 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు.

పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిత్రలేఖ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ విధ్వంసం అవుతుందన్నారు. మానవ స్వార్థ ప్రయోజనాల కోసం, లాభాల కోసం పర్యావరణ విధ్వంసం జరుగుతుందన్నారు. ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో మానవ మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులు సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్ గా, ఇంటర్ ఆపైన చదువుతున్న వారు సూపర్ సీనియర్స్ కేటగిరిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులందరూ 4వ తేదీ నాటికి తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మిగిలిన వివరాల కోసం 7901697939 ,9441709187 ఫోన్ నెంబర్లను సంప్రదించ వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రొంగల అరుణ్, కూనిరెడ్డి రవికుమార్, అమృత, నమ్రత, అంజలి, అనూష, బంగారం, సాయి, నాని, లోకేష్, యోగేష్, జస్విత, దారపు రెడ్డి కష్ణ, వీర్రాజు, ధరణి, మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వహకులు

4న పర్యావరణ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ, నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో 4వ తేదీన జిల్లా స్థాయి పర్యావరణ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి డి.రవీంద్రనాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చున్నారు. విజేతలకు ఈ నెల 5న జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు ఫారెస్ట్ రెంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ తెలిపారు.

కామేశ్వరరావుకు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణానికి చెందిన లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఛైర్మన్ టి.కామేశ్వరరావుకు గోల్డ్ స్టార్ ప్రతిభా సేవా పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ 8వ వార్షికోత్సవ కార్యక్రమంలో సినీ నటులు పధ్వీరాజ్, ట్రాఫిక్ అడిషనల్ డిఎస్‌పి రామదాసు, సీరియల్ యాక్టర్ నయ్ నీషా, సుమీత్, మెగా హెల్పింగ్ ఫౌండేషన్ శిరిషారెడ్డి చేతులు మీదుగా ఈ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ అవార్డు వల్ల తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. అవార్డు అందుకున్న ఆయనను పలువురు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్లాస్టిక్ నిర్మూలన ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్లో పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ప్లాట్ఫారాలు, స్టేషన్ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరుపరిచి ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే నష్టాలు, ప్లాస్టిక్ బదులు ఉపయోగించాల్సిన గుడ్డ సంచులు కాగితపు కవర్లపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత ప్లాస్టిక్ వినియోగం నిరోధంపై పోస్టర్లను అతికించి కరపత్రాల ద్వారా ప్రత్యేక కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు సిబ్బంది కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది రైల్వే ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో సామాజిక అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

చిన్ననాటి నుంచి పుస్తకాలు చదవటం ద్వారా విద్యార్థుల్లో సామాజిక అవగాహన పెరుగుతుందని హెచ్ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన పుస్తకాలు చదవటం, కథలు చదవటం, కథలు చెప్పడంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం అయితే లోకజ్ఞానం కోల్పోతారన్నారు. పుస్తకాలు, పేపరు చదవటం విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటలు పాడటం, పద్యాలు ఆలపించటంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

ఖరీఫ్ సాగుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని కలవచర్ల జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలవచర్ల శాస్త్రీయ బృందం సభ్యులు కె.ప్రసాద్, మురళీధర్, కార్తిరెడ్డి శ్యామల, భాష్యం నాగేశ్వరరెడ్డి పాల్గొని మాట్లాడారు. నూతన సాంకేతిక డ్రోన్ పద్ధతిలో మందులు పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శ్రీహరి, మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్, మండల ఉద్యానవన శాఖ అధికారిని లావణ్య, టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, జగ్గంపేట, మర్రిపాక, రాజపూడి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి గరగల ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 25 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మరిడమ్మ జాతరలో భాగంగా సోమవారం తొలి గరగల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గరగల నృత్యాలు డప్పుల దరువుల మధ్య ఈ ఉత్సవం కొనసాగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో ఆలయ ఆసాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, వేద పండితులు ఎన్‌వి.అవదాని, శంకర్, పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, సిబ్బంది ఎస్ రమణ, వరహాలు, శివ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు తప్పనిసరి

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆర్‌డిఒ శ్రీరమణి ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజన స్థాయి గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చట్టంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.సరిత, కమిటీ సభ్యులు సత్యరఘుకుమార్, కందుల వెంకటాచలం, పళ్ళ వాసవి, డాక్టర్ ఎల్ అనూషారాయ్, డాక్టర్ పి.సత్యవంశీ, డాక్టర్.జయేష్, డాక్టర్ రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - పెద్దాపురం

పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య విభాగానికి చెందిన అధికారులతో ఆయన సమీక్షించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్‌సి కార్పొరేషన్ ఈడీగా డి.పెద్దిరాజు సోమవారం స్థానిక ప్రగతి భవన్‌లోని ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీశైలం ఇఒగా పని చేస్తూ బదిలీపై వచ్చారు.

యానాం వార్తలు

చిరంజీవినీకుమారి మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - యానాం

ప్రముఖ విద్యావేత్త పి.చిరంజీవినీకుమారి మృతి సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాలకు తీరనిలోటని యానాం స్ఫూర్తి సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో సాహిత్య, సాంస్కృతిక కార్య కలాపాలకు పెద్ద దిక్కును కోల్పోయినట్లు అయ్యిందన్నారు. ఏప్రిల్ 13 తేదీన యానాంలో జరిగిన కళారత్న పురస్కార అభినందన సభలో పాల్గొని ఆద్యంతం ఉండి తనకు ఆశీస్సులు అందజేశారని గుర్తు చేశారు. ఆమె మృతికి పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పొనుగుమట్ల విష్ణుమూర్తి, డాక్టర్ శిఖామణి, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, నామాడి అప్పారావు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, పొనుగుమట్ల అశోక్‌కుమార్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

విజేతలకు మెడల్స్ వేస్తున్న మల్లాడి కృష్ణారావు

ముగిసిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ శిబిరం

ప్రజాశక్తి - యానాం

యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ సోమవారంతో ముగిసింది. ముగింపు వేడుకలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. మల్లాడి చేతుల మీదుగా మెడల్స్ ప్రధానం చేశారు. హాజరయ్యారు. నిర్వాహకులు మాట్లాడుతూ సుమారు 110 మంది యువతీ యువకులు శిక్షణకు హాజరయ్యారని, 21 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 36 అర్జీలు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 36 అర్జీలు వచ్చాయి. పాడా ఎపిడీ వసంత మాధవి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ అంశాలపై 36 అర్జీలు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ 4, పిఆర్ 4, మున్సిపాలిటీ 8, డిఆర్‌డిఎ 3, ఇతర అంశాలకు సంబంధించి 17 అర్జీలు వచ్చాయన్నారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం కమిషనర్ కనకారావు, తహశీల్దార్ గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగా శిక్షణకు ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో యోగా శిక్షణ కోసం 32,426 మందికి మ్యాపింగ్ చేసినట్లు ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 31,632 మంది టార్గెట్ కాగా 764 మందిని అదనంగా యోగా శిక్షణ కోసం మ్యాపింగ్ చేశామన్నారు. వీరికి 206 మంది ట్రైనర్స్ శిక్షణ ఇస్తారన్నారు. వీరందరికీ శిక్షణ ఇచ్చేందుకు ప్రతి సచివాలయానికి తొమ్మిది మంది మాస్టర్ ట్రైనర్స్ సిద్ధంగా ఉన్నారన్నారు.

పాసుపోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం, ఊబలంక గ్రామానికి చెందిన యర్లగడ్డ చిన్నారావు గారి కుమారుడు దిలీప్ అను నేను ది.25-05-2025 సం॥రం తేదీన నా పాసుపోర్టును నెం **X 5980837** తీసుకుని రావులపాలెం సెంటరుకు జిరాక్సు తీయించుకునే నిమిత్తం వెళ్లుచుండగా మార్గ మధ్యలో నా పాసుపోర్ట్ ఒరిజినల్ ఎక్కడో పడిపోయినది. నా పాసుపోర్టు కొరకు చుట్టు ప్రక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల కింది అడ్రస్‌కు ఇవ్వగలరు.

యార్లగడ్డ దిలీప్
ఊబలంక గ్రామం, రావులపాలెం మండలం
డా॥ ఆర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ : 9603971213

CHANGE OF NAME

I, VINAKOTI PADMAJA, D/o. Kamalanabham, previously called **BOBBILI PADMAJA** (Old Name), Now Changed my name from **BOBBILI PADMAJA** (Old Name) to **VINAKOTI PADMAJA** (New Name), Hence forth I will be called as **VINAKOTI PADMAJA,** D/o. KAMALANABHAM (New Name). for all purpose.

VINAKOTI PADMAJA
D/o. Kamalanabham
D.No. 7-158, Madhavarayunipeta
Tallarevu (V), Tallarevu (M)
Kakinada Dist., Cell : 9573727623

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE; TIRUPATI
E.P.No. 166/2024
O.S.No. 444/2021

Between: A.Dinesh ...Decree Holder
AND
A.Srinivas ...Judgment Debtor

NOTICE TO JDR

A.SRINIVAS,
S/o Late A.Ramakrishna Rao,
Resident Address: D.No. 32-7-21, A4, Sri Dathasai Apartments, Meraka Street, Near Anjaneya Swamy Temple, Rajahmundry
East Godavari District - 533 101, A.P.,

Please take notice that the above E.P. filed by the D.Hr for recovery of E.P. amount and the above E.P. is posted to 25-6-2025 for your appearance either in person or through your counsel at about 10.30 a.m. in the above court. Failing which matter will be decided ex parte.

(Order of the Court)
Date of hearing: 25-6-2025

KAVERIGARI NARAYANA
B.Com., M.L.,
ADVOCATE, TIRUPATI,
Cell: 80081 71739

వేలం ప్రకటన

In the Court of the Prinicipal Junior Civil Judge : Kakinada
E.P. 217 of 2019; in O.S. 488 of 2018

Between:
DEVAGURU CHANDRASEKHAR ..Decree Holder
and
CHENNA LAKSHMI PYDIRAJU ...Judgement-Debtor

DHr వేయించిన వేలం ప్రకటన

పై నెంబరు అమలు గ్రంథములో JDr వద్ద నుండి DHrకు రావలసిన డిక్రీ బాకీకి గాను, JDr తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని వేలవు యున్సీహోర్సు షరతులకు లోబడి **ది. 17-06-2025 సం॥ తేదీన ఉదయం గం. 10-30 ని॥ల** లగాయతు పై కోర్టువారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. పాడుకొనదలచినవారు వచ్చి నదరు వేలం పాట నందు పాల్గొని పాడుకోవలెను. వివరముల కొరకు పై కోర్టు నజారత్ నందు గాని, DHr అడ్వకేట్ గారి ఆఫీసు నందు గాని తెలుసుకొనవలెను.

Shedule: East Godavari District, Samalkota Municipality, Samalkota Sub-Registry, Samalkota Village, pension lane, RCC Building, bearing D.No. 1-1-53/a, of an extent of 100 square yards is situated with in the boundaries: **East:** House of Chenna Kannamma; **West:** House of Gudupu Subbarao; **North:** Road; **South:** Godowns of Mattapalli people.

Within the above boundaries, an extent of 320.55 sq.yards of site along with RCC building with all easementary rights.

DHr Value : Rs. 2,00,000/-
Amina Value : Rs. 8,00,000/-
JDr Value : Not Given

అద్దేపల్లి మురళీధర్, డిక్రీహోల్డర్ తరపు అడ్వకేట్
ప్రతాప్ నగర్, కాకినాడ, సెల్: 9849170270

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్): కొవ్వూరు వారి కోర్టులో
E.P. No. 60/2019
O.S.No. 217/2011

శ్రీ చంద్రు వీరవెంకట సూర్య ప్రభాకర చౌదరి, S/o భాస్కరరావు, హిందూ, వయస్సు 54 సం.లు, వ్యాపారం & వ్యవసాయం వల్ల జీవనం, R/o నేతాజీ నగర్, రాజమండ్రి. ..D.Hr.

మరియు

1. మారెడ్డి వెంకట సత్యవతి (Died),
2. మారెడ్డి త్రినాధ అప్పారావు, S/o లేటు సత్యనారాయణ, హిందూ, వయస్సు 39 సం.లు, వ్యాపారం R/o భీమోలు గ్రామం, గోపాలపురం మండలం, ప.గో.జిల్లా.
3. మారెడ్డి వీనీల, D/o లేటు సత్యనారాయణ, హిందూ, అవివాహిత, వయస్సు 35 సం.లు R/o భీమోలు గ్రామం, గోపాలపురం మండలం, ప.గో.జిల్లా ...J.D.r

వేలం ప్రకటన

పై నెంబరు E.P. గ్రంథములో D.Hr యొక్క డిక్రీ బాకీ వసూలు నిమిత్తం J.Dr లకు చెందిన E.P. షెడ్యూలు ఆస్తిని పై శ్రీ కోర్టు వారు **ది.18-06-2025**వ సం.తేదీన పై కోర్టులో ఉదయం గం.10-30 ని.లగాయతు వేలం వేయుదురని, ఆసక్తి కలవారు పాల్గొని పాడుకోవచ్చని, అందు యావత్తు సమాచారం శ్రీ కోర్టువారి నజారత్ ఆఫీసు నుండి గాని, D.Hr న్యాయవాది వారి ఆఫీసు నుండి కాని తెలుసుకోవచ్చునని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

వేలంపుయిస్తిహారు దాఖలా షెడ్యూలు ఆస్తివివరం: ప.గో.జిల్లా, ప్రస్తుతం తూ.గో.జిల్లా, గోపాలపురం మండలం, వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన, భీమోలు గ్రామ పంచాయితీ, భీమోలు రెవిన్యూ గ్రామంలో గల రి.స.నెం. 275రులో గల 2,3 J.Dr ల స్వాధీన హక్కు భుక్తములో వున్న జిరాయితీ మెరక **ఎ.13-54**ట్లలో **ఎ.1-00**ట్లు భూమికి హద్దులు : **తూర్పు :** మారెడ్డి త్రినాధ అప్పారావు గారి మిగిలిన భూమి, **ఉత్తరం :** కోట గట్టు, **పడమర :** బండారపు రాంబాబు గారి భూమి, **దక్షిణం :** భీమోలు నుండి గుడ్డిగూడెం రోడ్.

యీ హద్దుల మధ్యస్థమైన ఎ.1-00 ట్లు బూమి యావత్తు యీజిమెంటు హక్కులతో సహా.

D.Hr విలువ : **రూ. 12,00,000/-**
అమీనా విలువ : **రూ. 20,00,000/-**
S.RO. విలువ : **రూ. 12,00,000/-**
J.Dr విలువ : శ్రీ కోర్టు వారి J.Dr విలువ తెలియపర్చియుండలేదు.

శ్రీ కోర్టువారి అనుమతితో
శ్రీ సిహెచ్. వెంకటేశ్వరరావు
శ్రీ ఎస్.సుబ్బారావు
D.Hr తరపు అడ్వకేట్లు
కొవ్వూరు

కొవ్వూరు
ది.02-06-2025